క్లుప్తంగా

ప్రసాదం అందజేత



కాటారం: కేసీఆర్ ప్రధాని కావాలని ఆకాంక్షిస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి మండల కేంద్రంలో ఇటీవల నిర్వహించిన సుదర్శన నరసింహ యాగంకు సంబంధించిన ప్రసాదాన్ని సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితకు అందజేశారు. అనంతరం హైదరాబాద్‌లోని కోకాపేట్‌లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన భారత్ భవన్ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ అండ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో నారాయణరెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాటారం: గిరిజన గురుకుల బాలుర, బాలికల కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకులం రిజినల్ కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఏఅండ్‌టీ, ఐఅండ్‌ఎం, ఫిజియో తెరపీ, వొకేషనల్ కోర్సులలో సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హులైన బాలురు, బాలికలు ఆన్‌లైన్ ద్వారా రూ.వంద చెల్లించి ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

చిట్యాల: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై షాఖాన్ అన్నారు. సోమవారం మండలంలోని అందుకుతండా గ్రామంలో గుడుంబా, గంజాయి మత్తు పానియాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఎవరైనా గుడుంబా, గంజాయి విక్రయిస్తే తమకు సమాచారం అందించాలని వారిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనుమానితులుగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. జడల్‌పేట గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది లాల్‌సింగ్, అస్లాంజానీ, తదితరులు ఉన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

టేకుమట్ల: మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి 10 కింద అదృశ్యమై శవంగా కనిపించిన సంఘటన మండలంలోని రాఘవాపూర్‌లో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం భూపాలపల్లి మండలంలోని కాశీంపల్లి గ్రామానికి చెందిన దొంగల మొండయ్య(56) అనే వ్యక్తి సంవత్సర కాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. కాగా గత నెల 26న చిట్యాల మండలంలోని చింతకుంటరామయ్యపల్లిలో సమీప బంధువు చనిపోగా భార్య లక్ష్మీతో కలిసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. సాయంత్రం తిరిగి కాశీంపల్లికి భార్యను మాత్రమే పంపించి మొండయ్య అదే గ్రామంలో ఉన్నాడు. గత నెల 27న ఇంటికి వెళ్తున్నానని బంధువులకు చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మొండయ్య ఇంటికి చేరుకోకపోగా మే 29న చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సోమవారం మండలంలోని రాఘవాపూర్ గ్రామానికి చెందిన కారుపాకల రమేష్ అనే వ్యక్తి వ్యవసాయ పొలానికి వెళ్లగా అక్కడ మృతి చెందిన వ్యక్తిని గుర్తించి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీంతో మొండయ్య కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో అక్కడి చేరుకున్నారు. మృతుడి కుమారుడు కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రాంభించినట్లు ఎస్సై చల్ల రాజు తెలిపారు.

గుడిసె దగ్ధం

మహాముత్తారం: మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన జాటోత్ కల్యాబాయి పూరి గుడిసె సోమవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మంటలు చెలరేగాయి. గమనించిన గ్రామస్తులు కరెంటు మోటార్ల ద్వారా నీళ్లను గుడిసెపై చల్లడంతో భారీ ప్రమాదం తప్పింది. దీంతో కాల్యాబాయి కుటుంబసభ్యులు గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

వరికొయ్యల్లో పోషకాలు మెండు

అవగాహన లేక కాల్చుతున్న అన్నదాతలు

- భూసారంతో పాటు దిగుబడిపై ప్రభావం
- మేలు చేసే సూక్ష్మజీవులు నాశనం
- అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం



కొయ్యకాళ్లు కాల్చడం వల్ల నల్లబారిన నేల

మల్హర్: ప్రధాన ఆహార పంట అయిన వరి కోతల అనంతరం కొయ్యకాళ్లను చాలా మంది రైతులు పంటపొలాల్లోనే కాల్చివేస్తున్నారు. దీంతో పంటలకు నష్టం వాటిల్లడంతో పాటు అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయని ప్రతి సీజన్‌లో వ్యవసాయ అధికారులు చేబుతున్న రైతులు పట్టించుకోవడం లేదు. వరి పంటలో సాధారణంగా ధాన్యం ఎంత దిగుబడి వస్తుందో, దాదాపు అంతే మోతాదులో గడ్డి(పశుగ్రాసం), కొయ్యకాళ్లు లభ్యమవుతాయి. అయితే వరిని హార్వెస్టర్ల ద్వారా కోయడం వల్ల గడ్డి చేనులోనే ఉండిపోతుంది. ప్రతీ సంవత్సరం పశుసందప తగ్గిపోతుండటంతో రైతులు గడ్డిని తీసుకెళ్లడానికి ఆసక్తి చూపించడం లేదు. అయితే పొలంలో వదిలేసిన గడ్డి పొడిదుక్కి దున్నేటప్పుడు నాగళ్లకు అడ్డుగా వస్తుందనో, సాలు సరైన లోతుగా రాదనో, దమ్ము(జంబు)వేసిన తరువాత కుళ్లిపోవడానికి చాలా సమయం పడుతుందనో ఇలా రకరకాల అపోహల వల్ల అన్నదాతలు పొలాల్లోనే మిగిలిన గడ్డి, కొయ్యకాళ్లను తగలబెడుతున్నారు.

కొయ్యకాళ్లు కాల్చడం వల్ల నష్టాలు

కొయ్యకాళ్లు కాల్చడం వల్ల నేలకు అందాల్సిన సేంద్రీయ పదార్థాలు అందకుండా పోతాయి. నేల పైపొరల్లో ఉండే మేలు చేసే సూక్ష్మజీవులు నశిస్తాయి. పంట కాలంలో వేసిన ఎరువుల్లో ధాన్యం దిగుబడికి వాడుకోగా మిగిలిన పోషకాలు కొయ్యకాళ్లల్లోనే నిల్వ ఉండిపోతాయి. వాటిని కాల్చడం వల్ల నేలకు లాభం ఉండదు. అలాగే కొన్నిసార్లు పెద్ద ఎత్తున లేచి పక్క పొలాల్లో విస్తరించే అవకాశం ఉంది. దీని వల్ల పంటపొలాల్లోని వ్యవసాయ విద్యుత్ మోటార్లు, స్టార్టర్లు, వైర్లు, పైపులు కాలిపోయే ప్రమాదం కూడా ఉంది.

చెలరేగిన మంటలు



కొయ్యకాళ్లు కాల్చడంతో వ్యాపిస్తున్న మంట(ఫైల్)

కొయ్య కాలు కాల్చేందుకు ఆదివారం ఓ రైతు పెట్టిన నిప్పు కారణంగా మండలంలోని కొయ్యూరు, వలెకుంట, ఎడ్లపల్లి గ్రామాల శివారులోని పొలాలకు వ్యాపించింది. దీనికి తోడు ఈదురు గాలులు రావడంతో మంటలు వ్యాపించి గ్రామాల్లో పొగలు కమ్ముకున్నాయి. గత వారం రోజుల క్రితం కూడ ఎడ్లపల్లి గ్రామంలో కొయ్యలకు నిప్పుపెట్టడంతో మంటలు వ్యాప్తించి చివరి దశకు వచ్చిన ఓ రైతు పొలం దగ్ధమైనట్లు వ్యవసాయ అధికారులు తెలియజేస్తున్నారు.

కాల్చకపోవడం వల్ల కలిగే లాభాలు...

కొయ్య కాళ్లను కాల్చకపోవడం వలన వేసవిలో నమోదయ్యే అధిక ఉష్ణోగ్రతల నుంచి నేలను కాపాడుకోవడానికి గడ్డి మాల్చింగ్ లాగా ఉపయోగపడుతుంది. పచ్చిరొట్టుగా జనుము, జీలుగు, వంటి వాటిని పెంచుకున్నప్పుడు లభించే 40–45రోజుల సమయంలో వరిగడ్డి పూర్తిగా కుళ్లిపోయి నేలలో కలిసిపోతుంది. నేల భౌతిక, స్వరూప, స్వభావాలు మెరుగుపడతాయి. కొయ్యకాళ్లను కలియ దున్నడం వల్ల తర్వాత పంటకు ఎరువుగా ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇప్పటికైన రైతులు వివిధ అపోహలను విడనాడి కొయ్యకాళ్లను కాల్చివేయడం ఆపివేయాలి.

దిగుబడిపై ప్రభావం



కొయ్యకాళ్లను తగులవెడితే భూసారంతో పాటు దిగుబడిపై ప్రభావం ఏర్పడుతుంది. పంట ముగిశాక పొలంలో ఉన్న గడ్డిని కాల్చవద్దని రైతులకు చాలా సార్లు అవగాహన కల్పించాం. దాని వలన కలిగే నష్టాల వలన కూడా వివరించాం. చాలా మంది రైతులు ఈ సంవత్సరం కొంత వరకు గడ్డిని కాల్చడం తగ్గించారు. పూర్తి స్థాయిలో తగ్గించడానికి రైతులకు అవగాహన కల్పిస్తాం.

– మహేష్, మండల వ్యవసాయ అధికారి, మల్హర్

పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం

చిట్యాల: మండలంలోని పాశిగడ్డతండాలో మూడు రోజులుగా బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు వేర్వేరుగా హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో సుఖంగా ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం ఒక్కొక్కరు రూ.25వేల చొప్పున విరాళంగా ఉత్సవ కమిటీ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లావుడ్య రజిత హరిభూషన్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆరెపల్లి మల్లయ్య, నాయకులు, కాంగ్రెస్ నాయకులు లావుడ్య రవీందర్, భద్రయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న, సత్యనారాయణరావు

చెరువుల పండుగ ఏర్పాట్లపై సమీక్ష



మహాముత్తారం: మాట్లాడుతున్న ఎంపీపీ సుభద్ర

పలిమెల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8న నిర్వహించే చెరువుల పండుగ ఏర్పాట్లపై మండల స్పెషల్ ఆఫీసర్ సుధీర్‌కుమార్ సోమవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువుల పండుగను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు ఉండాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మండలంలోని ఆలం నాగయ్య చెరువు, పంకన చెరువులను సందర్శించి ఏర్పాట్లపై చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మార్వో స్రవంతి, సర్పంచ్ జవ్వాజి పుష్పలత, బొచ్చు శ్రీనివాస్, మిషన్ భగీరథ ఏఈ సాయిరాం, ఏపీఓ సునీత, ఐబీ ఏఈ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహాముత్తారం: ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఎంపీపీ రత్నం సుభద్ర అన్నారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 8న మండల కేంద్రంలో నిర్వహించే మన ఊరు మన చెరువు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సోమవారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల స్పెషలాఫీసర్ వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీఓ శ్రీనివాస్‌రావు, నీటి పారుదలశాఖ ఏఈ, డీఈ, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కాటారం: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8న నిర్వహించనున్న ఊరూర చెరువుల పండుగపై సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శంకర్‌నాయక్ ఆధ్యక్షతన అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఏఓ, ఎంపీఓ, ఏపీఎం, ఇరిగేషన్ ఏఈఈ, ఐకేపీ సీసీలు పాల్గొన్నారు.

కాళేశ్వరం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8న చెరువుల పండుగ నిర్వహించడానినికి అధికారులతో ఎంపీపీ రాణిబాయి అధ్యక్షతన సమావేశం సోమవారం నిర్వహించారు. మండలంలోని 12 చెరువుల వద్ద చెరువుల పండుగ నిర్వహించాలన్నారు. సుమారుగా 300 మంది గ్రామ ప్రజలు పాల్గొనేలా చూడాలన్నారు. విధులు కేటాయించిన అధికారులు ప్రజలకు, కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ జెడ్పీ సీఈఓ రఘువరణ్, ఎంపీడీఓ రవీంద్రనాథ్, ఎంపీఓ ప్రసాద్, ఏపీఓ రమేష్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టేంట్లు పాల్గొన్నారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి



పనులను పరిశీలిస్తున్న హరీశ్

మల్హర్: మండలంలోని జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ గిరి హరీశ్ అన్నారు. తాడిచర్ల గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పథకం ఆధ్వర్యంలో పెంజెరువులో చేపడుతున్న ఫిష్ బ్రీడింగ్ పనులను హరీశ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఫిష్ బ్రీడింగ్ కొలతల గూరించి కూలీలకు వివరించారు. ఫిష్ బ్రీడీంగ్ తీయడం వలన చేపల పెంపకానికి అనుకూలంగా ఉంటుందని వివరించారు. చెరవు మట్టిని రైతులు పొలాలకు వేసుకుంటే పంట దిగుబడి అధికంగా వస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఫిల్డ్ అసిస్టెంట్ సుమలత, మేట్స్ సంధ్యారాణి, సదయ్య, కూలీలు ఉన్నారు.

పరామర్శ



నివాళులర్పిస్తున్న స్నేహితులు

చిట్యాల: మండలంలోని అందుకుతండా గ్రామానికి చెందిన దాసారపు యోహాన్ తండ్రి భూషణం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని యోహాన్ స్నేహితులు పరామర్శించి రూ.19వేల నాలుగు వందలు నగదును సోమవారం అందించారు. అనంతరం మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు మూడెత్తుల మహేందర్, బుర్ర అనిల్, డీజే ప్రభు, బండి సురేష్, కల్వచర్ల కిషోర్, పోలవేన కుమార్, నేపాలి రాకేష్, నోముల వేణు, గురుకుంట్ల కిరణ్, రేణుకుంట్ల రాము పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



రేగొండ మండలం రామన్నగూడెంతండాలో బడి బాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామంలో సర్పంచ్ సుంకరి సత్తయ్య ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరస్వతి, అంగన్‌వాడీ సిబ్బంది సోమవారం అంగన్‌వాడీ బడి బాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి మాట్లాడుతూ.. 3 సంవత్సరాలు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. పిల్లలకు సిలబస్ ప్రకారం ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు నిర్వహించి పాఠాలు నేర్పించడం జరగుతుందని వెల్లడించారు. శారీరక అభివృద్ధి కోసం ప్రతి రోజు పౌష్టికాహారం అందించి పిల్లల బరువులు తీసి వారి పోషణ స్థాయిని తల్లులకు తెలియజేయనున్నట్లు వివరించారు. అనంతరం ఆరు నెలలు దాటిన పిల్లలకు అన్నప్రసాన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

పలిమెల: పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. మండలంలోని నీలంపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బడి ఈడు పిల్లలను బడికి పంపాలని వారు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు ఆదిలక్ష్మి, కుర్సం కమల, ఆశ వర్కర్ శ్రీలత పాల్గొన్నారు.

టేకుమట్ల/రేగొండ: టేకుమట్ల, రేగొండ మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం పల్లెల్లో బడిబాటను నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాల విద్యపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సధాకర్, కుడికాల శ్రీనివాస్, కామిడి సతీష్‌రెడ్డి, ఓనపాకల రవిందర్, ఉపాధ్యాయులు బుచ్చిరాములు, నాగరాజు, కుసుమ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామంలో బాడి బాట కార్యక్రమం సోమవారం నిర్వహించినట్లు పాఠశాల హెచ్ఎం గోవింద సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధుల వెంట బ్యానర్లు, కరపత్రాలతో ఇంటింటా తిరిగి విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భగవాన్ రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు కవిత, శారద, విద్యా కమిటీ చైర్మన్ వీరాస్వామి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కాటారం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేలా ఉపాధ్యాయులు చేపడుతున్న బడిబాట కార్యక్రమం మండలంలో కొనసాగుతుంది. గ్రామాల్లో ఇంటింటా తిరగడమే కాకుండా తల్లిదండ్రులు అధిక సంఖ్యలో ఎక్కడ ఉంటున్నారో అక్కడికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. మండలంలోని ఒడిపిలవంచ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం ఉపాధిహామీ పనులు చేపడుతున్న ప్రదేశానికి వెళ్లి తల్లిదండ్రులు తమ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.



చిట్యాల: చల్లగరిగలో..



మల్హర్: ర్యాలీలో అంగన్‌వాడీ టీచర్లు



టేకుమట్లలో..

ప్రశంసపత్రం అందుకున్న ఎస్సై

గణపురం: మండలంలో ఉత్తమ సేవలు అందించిన ఎస్సై అభినవ్‌కు అరుదైన గౌరవం దక్కింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఉత్తమ సేవలు అందించిన అధికారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి సన్మానాలు, ప్రశంసపత్రాలు అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో అవార్డులకు గణపురం ఎస్సైగా ఉత్తమ సేవలు అందించిన ఎస్సై అభినవ్‌తో పాటు హెడ్ కానిస్టేబుల్ నర్సింహ రెడ్డి, కానిస్టేబుల్ రాజు, స్వాతి, శ్రీవిద్యలు ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, కలెక్టర్ భవేష్‌మిశ్రా, ఎస్పీ సురేందర్‌రెడ్డిలు సన్మానించి ప్రశంసపత్రాలు అందించారు.



ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న అభినవ్

దశాబ్ది ఉత్సవాలు సిగ్గుచేటు



చిట్యాల: విద్యుత్ తీగలను పరిశీలిస్తున్న గండ్ర

చిట్యాల: ఎక్కడి సమస్యలు అక్కడే ఉంచుకుని రాష్ట్రంలో ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తపేట గ్రామ శివారు ఎస్సీ కాలనీ ముందు ఓ రైతుకు చెందిన పంట చేనులో కట్టెకు కట్టిన విద్యుత్ తీగలు మొత్తం నిలబడితే తాకే పరిస్థితిలో కిందకి వేలాడుతుండగా రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మొత్తం విద్యుత్ స్తంభాలు, తీగల సమస్యలు ఇలాగే ఉన్నాయని అన్నారు. విద్యుత్ అధికారుల మూలంగా రేగొండ మండలంలో ఓ రైతు మృత్యువాత పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉండగా దశాబ్ది ఉత్సావాలు ఏలా నిర్వహిస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా విద్యుత్ స్తంభాలు, తీగలను సరి చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ

దేశ, రాష్ట్రంలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని జూకల్‌లోని బీఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో మండ ల ముఖ్య కార్యకర్తల సమావేశం తిరుపతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మొగుళ్లపల్లి: కర్ణాటక ఎన్నికల ఫలితాలే తెలంగాణలోనూ రిపీట్ అవుతాయని, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని అమ్మ గార్డెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి అధ్యక్షతన అన్ని గ్రామాల ముఖ్య కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. అనంతరం మండల కాంగ్రెస్ పార్టీని ప్రకటించారు. మండల ప్రెసిడెంట్‌గా ఆకుతోట కుమారస్వామి ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్టేట్ ఎస్సీ సెల్ కన్వీనర్ దబ్బెట రమేష్, స్టేట్ ఓబీసీ కోఆర్డినేటర్ ఓరుగంటి శంకర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దూడపాక శంకర్, జిల్లా కార్యదర్శి వైనాల రవీందర్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మల్హర్: మొక్క నాటి నీళ్లు పోస్తున్న పీఆర్ఓ



చిట్యాల: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పలిమెల: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని మండల స్పెషల్ ఆఫీసర్ సుధీర్‌కుమార్ అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలో మిషన్ లైఫ్ క్యాంపెయిన్‌లో భాగంగా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మిషన్ లైఫ్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారికి పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి, సర్పంచ్ జవ్వాజి పుష్పలత, ఏపీఓ సునీత, మిషన్ భగీరథ ఏఈ సాయిరాం, ఐబీ ఏఈ, పంచాయతీ కార్యర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మల్హర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఎమ్మార్ కంపెనీ సినీయర్ జనరల్ మేనేజర్ చంద్రమౌళి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని తాడిచర్ల ఓపెన్‌కాస్ట్ మైన్‌లో ఏఎమ్మార్ వైస్ ప్రసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు తప్పని సరిగా మొక్కలు నాటడంతో వాటి పరిరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ అధికారి సురేష్‌బాబు, శ్రీనివాస్, పీఆర్ఓ మల్లేష్, రామ్‌కుమార్, రవీందర్, రవికుమార్, అభిషేక్, తిలక్, సరోత్తం, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని జెడ్పీ సీఈఓ, మండల స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మీ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. అలాగే తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈ నెల 8న మండలంలోని ప్రతి గ్రామాలలో ఊరురా చేరువుల పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చేయూత



ఆర్థికసాయం చేస్తున్న సభ్యులు

కాటారం: మండలంలోని గుమ్మాళ్లపల్లికి చెందిన మొలంగిరి కిష్టయ్య, మల్లక్క దంపతులు నిరుపేదలు. కిష్టయ్యకు కంటి చూపు సరిగా లేకపోవడంతో పాటు మల్లక్క షుగర్ వ్యాధితో అనారోగ్యం పాలైంది. కాగా వారి కూతురు వనిత కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోశిస్తూ వస్తుంది. ఈ నెల 7న వనిత వివాహం కుదిర్చారు. నిరుపేదలైన కిష్టయ్య మల్లక్క దంపతులకు వనిత వివాహం భారంగా మారి ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నారు. విషయం తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు కిష్టయ్య రూ.10వేల ఆర్థిక సాయం ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా ఇన్‌చార్జ్ పోచన్న, సభ్యులు బొగ్గుల నాగరాజ్, సంపత్, రాజు, మల్లికార్జున్, మేదరి సంఘం జిల్లా అధ్యక్షుడు గైని రమేశ్, మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు తోట కోటేశ్వర్, పాడి రాజయ్య పాల్గొన్నారు.